




కేన్సర్ నివారణపై అవగాహన

ప్రజాశక్తి-నెల్లూరు : ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో విద్యుత్ భవన్ లో మహిళా అధికారులకు మహిళ ఉద్యోగులకు కేన్సర్ నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. మంగళవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎస్ఈ వి.విజయన్ మాట్లాడుతూ విద్యుత్తు భవన్ క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసినందుకు రెడ్ క్రాస్ వారికి ప్రత్యేక కతజ్ఞతలు తెలిపారు. కేన్సర్‌పై ప్రతి ఒక్కరు అవగాహన పెంచుకొని దాని భారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. క్రమం తప్పకుండా వ్యాయాయము, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు పాటించడం చేయాలని తెలిపారు. ప్రముఖ వైద్యురాలు లక్ష్మీ మాట్లాడుతూ క్యాన్సర్ ను తొలిదశలోనే గుర్తిస్తే ప్రాణాపాయం తప్పుతుందని కానీ చాలా మంది చివరి దశలో గుర్తించి తమ జీవితాన్ని కోల్పోతున్నారని తెలిపారు. డాక్టర్ లక్ష్మీ, డాక్టర్ కన్యాకుమారి, సిస్టర్ పద్మజ ఉన్నారు.



బడ్జెట్ షరా మామూలే..!

2024-25 కేంద్ర బడ్జెట్‌లో కొత్తదనం ఏమీ కనిపించలేదు.. అంతా షరా మామూలేనా కనిపించింది. వేతనజీవులు, సాధారణ ప్రజలు ఎదురుచూపులకు నిరాశమే గిల్చింది. మూడో సారి అధికారంలోకి వచ్చిన మోడి వరాలు కురిపిస్తారని అందరూ భావించారు. నిత్యావసర ధరలు, అభివృద్ధి, జిల్లాలో పారిశ్రామిక ప్రగతి, వంటి ప్రధాన అంశాలకు పెద్దగా మార్పు కనిపించలేదు. గ్రామీణ గృహనిర్మాణం కోసం పేదలు ఎదురు చూస్తున్నారు. హైదరాబాద్- చెన్నయ్ పారిశ్రామిక కారిడార్ ప్రకటించింది. ఇది నెల్లూరు గుండా వెళ్లడం వల్ల కొంత ఉపయోగం కనిపిస్తోంది. సేంద్రీయ వ్యవ సాయానికి పెద్ద పీట వేస్తారని చెబుతుండగా, జిల్లాలో 67 వేల హెక్టార్లకు కొంత ఉపయోగం కనిపిస్తోంది. ఈ బడ్జెట్‌పై రాజకీయ పార్టీలు పెదవి విరుస్తున్నాయి..

- ◆కొత్త ప్రభుత్వంలో కొత్తదనం ఏదీ..
- ◆గ్రామీణ గృహనిర్మాణానికి ఊతం
- ◆సేంద్రీయ వ్యవసాయం ఓకే..
- ◆చెన్నెయ్- హైదరాబాద్ కారిడార్ వస్తుందా..



ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి

కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మాలా సీతారామన్ ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ సాదాసీదాగా కనిపిస్తోంది. ఏ రంగంలోనూ పెద్దగా మార్పు కనిపించలేదు. ఈ బడ్జెట్ జిల్లాకు ఏలాంటి ప్రయోజనం కనిపించడం లేదు. వెనుక బడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజీ ఇస్తామని ప్రకటించారు. అందులో నెల్లూరు లేదని తెలిసింది. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం కింద గ్రామీణ ప్రాంతాల్లో గృహనిర్మాణాలు చేపడతామని తెలిపారు. దేశవ్యాపితంగా 3 కోట్ల గృహాలు నిర్మించనున్నారు. ఇందులో కొంత జిల్లాకు వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. వెంకయ్య నాయుడు మంత్రిగా ఉన్న సమయంలో కొంత ప్రయోజనం కలిగింది. పట్టణ గృహనిర్మాణాకి రూ 2.2 లక్షలకోట్లు కేటాయించారు. అర్బన్ హౌసింగ్‌స్కీమ్‌లో నిరుపేదలకు కొంత మేర ఉపయోగం కలిగే అవకాశాలున్నాయి. సేంద్రీయ వ్యవసాయానికి పెద్ద పీట వేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. జిల్లాలో సుమారు 67 వేల హెక్టార్లలో సేంద్రీయ వ్యవసాయం సాగుతోంది. ఈ వర్గానికి కొంత ఉపయోగం ఉంటుందని చెబుతు న్నారు. 20 లక్షల మంది యువతకు నైపుణ్య శిక్షణ ఇస్తామని బడ్జెట్‌లో తెలిపారు. ఇదే సక్రమంగా అమలుజరిగితే జిల్లాలోని అనేక పరిశ్రమల్లో పనిచేసే యువతకు నైపుణ్య శిక్షణ అందే అవకాశాలున్నాయి. బంగారం, వెండి ధరలు తగ్గనున్నాయి. చెన్నయ్ - హైదరాబాద్ ఇండస్ట్రియల్ కారిడార్ నిర్మాణం చేస్తామని ప్రకటించారు. ఇదే అమలు జరిగితే నెల్లూరు మీదుగా దీని నిర్మాణం సాగుతోంది. యువతకు కొంత ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దక్కుతా యి. ఇలాంటి అంశాల తప్ప జిల్లాకు ప్రత్యేకంగా బడ్జెట్ ద్వారా ఏమీ ఉపయోగం కనిపించడం లేదు. ప్రజలు పెట్రోల్, డీజిల్, ఇతర నిత్యవసర ధరలతో సతమతమవుతున్నారు. వీటి నియంత్రణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో పేర్కొనలేదు. సాధారణ, మధ్య తగతతి ప్రజలు, వేతన జీవులకు ఈ బడ్జెట్ పెద్దగా ఊరట ఇవ్వలేదని తెలుస్తోంది.

ప్రజల జీవన విధానం మారదు..


మూలం రమేష్ , సిపిఎం జిల్లా కార్యదర్శి



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పేద, మధ్యతరగతి ప్రజల జీవిన విధానంలో ఎలాంటి మార్పు తీసుకుచ్చేలా కనిపించడం లేదు. పెరిగిన ధరలు, ప్రజల జీతా లకు పొంతన లేకుండా పోయింది. ధరల నియంత్రణకు ఎలాంటి హామీ ఇవ్వలేదు. పెట్రోల్, డీజిల్ ధరలను నియంత్రణ చేయడం లేదు. మూడో సారి మోడీ అధికారంలోకి వస్తే ఏదో జరిగిపో తుందని ప్రజలు ఆశించారు. బడ్జెట్‌లో అలాంటివి ఏమీ కనిపించలేదు.

సాదాసీదా బడ్జెట్

పి. చంద్రశేఖర్‌రెడ్డి , వైసిపి జిల్లా అధ్యక్షులు



కేంద్ర బడ్జెట్‌లో కొత్త ధనం ఏమీ కనిపించలేదు. సాదాసీదాగానే ఉంది. అమరావతి నిర్మాణానికి రూ 15 వేల కోట్లు ఇస్తామన్నారు. అది రుణమా, సాయమా చెప్పలేదు. ఈ మొత్తం మీధ ప్రజల మీద భారంగా మోపే ప్రమాదం ఉంది. జిల్లాలకు ఏలాంటి ప్రయోజనం ఈ బడ్జెట్‌లో కనిపించడం లేదు. పారిశ్రామిక అభివృద్ధి, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు సంబంధించి ఏలాంటి ప్రకటన లేదు.

ఇసుక అక్రమ రవాణా నివారణకు
టాస్క్‌ఫోర్స్ బృందాలు

ప్రజాశక్తి నెల్లూరు : జిల్లాలో ఇసుక అక్రమ రవాణాను నిరోధించేందుకు జిల్లా , డివిజన్, మండల స్థాయిలో ప్రత్యేక టాస్క్ ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఓ ఆనంద్ సంబంధిత అధికారులను ఆదేశించారు.మంగళవారం కలెక్టరేట్ లోని జిల్లా కలెక్టర్ ఛాంబర్‌లో మూడో జిల్లాస్థాయి ఇసుక కమిటీ సమావే శం నిర్వహించారు.నూతన ఇసుక విధానం గురించి మైనింగ్ ఉపసంచాలకులు శ్రీనివాస కుమార్ కమిటీ సభ్యులకు వివరించారు. జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్, జిరోస్ఎస్ ఎన్ ఇ కష్ట మోహన్, ఆర్ డి ఓ లు మాల్‌ల, మధులత పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రంలో పరిశీలన

ప్రజాశక్తి-నెల్లూరు : లెప్రసీ వ్యాధిని ప్రాథమిక దశలో గుర్తించడం ద్వారా అంగవైకల్యాన్ని పూర్తి స్థాయిలో నివారించడం సాధ్యమౌతుందని జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, క్షయ నియంత్రణాధికారి డాక్టర్ ఖాదర్‌వలి అన్నారు. మంగళవారం ఆయన కిసాన్‌నగర్ ప్రాంతంలోని పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. జిల్లా వ్యాప్తంగా వైద్య ఆరోగ్యశాఖ నిర్వహిస్తున్న ఎల్‌సిడిసి సర్వే కార్యక్రమ తీరుతెన్నులను పరిశీలించారు. ఈ సర్వేకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. డాక్టర్లు సునీల్ బాబు, డిఎస్‌పిఎంఓ సతీష్, డిపిఎంఒ డాక్టర్ బి.వి సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారుల ఎంపికను పూర్తి చేయాలి

ప్రజాశక్తి-నెల్లూరు : ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం కింద లబ్ధిదారుల ఎంపికను సకాలంలో సిబ్బంది ద్వారా పరిశీలన ప్రక్రియ పూర్తి చేయాలని కలెక్టర్ ఓ ఆనంద్ సూచించారు.మంగళవారం కలెక్టరేట్‌లో ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం జిల్లా అమలు కమిటీ సమావేశం నిర్వహించారు. డి ఐ సి జనరల్ మేనేజర్ సుధాకర్ ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం ఉద్దేశాలను వివరించారు. . డి ఆర్ డి ఎ పిడి సాంబశివ రెడ్డి, మున్సిపల్ అడిషనల్ కమీషనర్ శర్మద, ఎల్ డి యం శ్రీకాంత్ పాల్గొన్నారు.

కోస్టల్ జోన్ మేనేజ్‌మెంట్ ప్లాన్ అమలుపై
ప్రజాభిప్రాయ సేకరణ

ప్రజాశక్తి-నెల్లూరు : సముద్ర తీరప్రాంత మత్స్యకారుల సాంప్రదాయ జీవన విధానానికి ఇబ్బందులు లేకుండా కోస్టల్‌జోన్ మేనేజ్‌మెంట్ ప్లాన్‌ను అమలుచేయాలని మత్స్యకారులు అధికారులను కోరారు. మంగళవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో కోస్టల్ జోన్ మేనేజ్‌మెంటు ప్లాన్ ఖరారుపై జిల్లా రెవెన్యూ అధికారి లవన్న, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ రాజశేఖర్ ఆధ్వర్యంలో పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ప్రజాభిప్రాయ సేకరణకు బోగోలు, విడవలూరు, మైపాడు, ఇందుకూరుపేట ముత్తుకూరు తదితర మండలాల తీరప్రాంత గ్రామాల నుంచి పలువురు మత్స్యకారులు,పలు సంఘాలు హాజరయ్యారు. ఈ సందర్భంగా మత్స్యకారులు మాట్లాడుతూ దశాబ్దాలుగా సముద్ర తీర ప్రాంతాల్లో చేపలవేటపై ఆధారపడి జీవిస్తున్న తమ హక్కులకు భంగం కల్గించకుండా ఈ ప్లాన్‌ను అమలు చేయాలని కోరారు. సిఆర్ జెడ్ ఖరారులో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఈ ప్రజాభిప్రాయ సదస్సులను తీర ప్రాంత గ్రామాల్లో నిర్వహిస్తే ఎక్కువమంది మత్స్యకారులు హాజరయ్యే అవకాశం ఉందని సూచించారు. పలు సమస్యలను మత్స్యకారులు అధికారులకు వివరించారు. కడలూరుకు చెందిన తమిళ జాలర్ల వల్ల తాము ఇబ్బందులు పడుతున్నామని, తమ మత్స్య సంపదను వారు దోచుకెళ్లి తమపై దాడులు చేస్తున్నారని, తమకు రక్షణ కల్పించాలని కోరారు. బకింగ్‌హామ్ కెనాల్ పూడికతీత పనులు చేపట్టాలన్నారు.కోస్టల్ జోన్ మేనేజ్‌మెంటు ప్లాన్ ఖరారులో మత్స్యకారులు తెలిపిన అన్ని అభిప్రాయాలను వీడియో రికార్డు చేసి కేంద్ర పర్యావరణ శాఖ కు నివేదిస్తామని ఈఈ రాజ శేఖర్ తెలిపారు. ఎన్విరాన్‌మెంటల్ సీనియర్ ఇంజనీరు శాస్త్రి ఉన్నారు.



పారిశుద్ధ్య పనులపై సమీక్ష



ప్రజాశక్తి -నెల్లూరు సిటీ : వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో నగర వ్యాప్తంగా పారిశుద్ధ్య నిర్వహణ ప్రణాళిక కట్టుదిట్టంగా నిర్వహించి పరిశుభ్రత ఎజెండాగా పనిచేయాలని బహిరంగ ప్రదేశాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని అదనపు కమిషనర్ శర్మద తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు నగర పాలక సంస్థ శానిటేషన్ విభాగం అధికారులతో కమాండ్ కంట్రోల్ సెంటర్ లో మంగళవారం సమీక్ష సమావేశం ఆమె నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ నగర పాలక సంస్థ పరిధిలోని అన్ని ప్రధాన రోడ్లను క్రమంతప్పకుండా శుభ్రం చేయాలన్నారు. అన్ని డివిజన్లల్లో ఇండ్ల మధ్య, ప్రాంగణాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకునే విధంగా గృహ యజమానులకు అవగాహన కల్పిం చాలన్నారు. నగర పాలక సంస్థ పరిధిలో సీజనల్ వ్యాధులపట్ల సమాచారం, చికిత్స, ఇతర వివరాల కోసం 0861-2316777 నెంబరులో సహాయ సిబ్బందిని అందుబాటులో ఉంచామన్నారు. సమీక్షలో నగర పాలక సంస్థ శానిటేషన్ విభాగం సూపర్ వైజర్లు, ఇన్స్పెక్టర్ లు, ఉన్నారు.

జాషువాకు ఘన నివాళి

ప్రజాశక్తి-కందుకూరు : విశ్వ నరుడు గుర్రం జాషువా 73వ వర్ధంతి సందర్భంగా జాషువా సాహిత్య సాంస్కతిక సంస్థ ఆధ్వర్యంలో కందుకూరు బుద్ధ అంబేద్కర్ విజ్ఞాన కేంద్రం వద్ద ఆయన చిత్రపటానికి మంగళవారం నివాళులర్పించారు. జాషువా సాహిత్య సేవలను పలువురు వక్తలు కొనియాడారు. జాషువా సాహిత్యం లోకానికి వెలుగు పంచిన దివిటి లాంటిదని అన్నారు. జాషువా సాహిత్య సాంస్కతిక సంస్థ అధ్యక్షులు,పాలపిట్ట ధీర్ఘ కావ్య రచయిత ముప్పవరపు కిషోర్, దమ్మచక్ర ఫౌండేషన్ అధ్యక్షులు గాండ్ల హరి ప్రసాదు, మాజీ కౌన్సిలర్ రేణమాల అయ్యన్న, పలనాటి వీరాచార జానపద కళాకారులు కిన్నెర బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు. తొలుత జాషువా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.



పొగాకు వేలం కేంద్రంలో పరిశీలన

ప్రజాశక్తి-కందుకూరు : పొగాకు బోర్డు ఒంగోలు రీజినల్ మేనేజర్ ఎం లక్ష్మణ రావు కందుకూరు వేలం కేంద్రం 27ను మంగళవారం సందర్శించారు. బోర్డు సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు.అనంతరం వారు అనధికార బ్యారన్ల నిర్మాణం వల్ల కలిగే నష్టాలు రైతులకు వివరించాలని, అలా నిర్మించడం చట్ట ప్రకారం నేరం అని తెలిపారు. ప్రస్తుతం ఉన్న మార్కెట్‌ను దృష్టిలో ఉంచుకొని పొలాలు, బ్యారన్లు అధిక ధరలకు లీజుకు తీసుకోవద్దని తెలిపారు రైతు సోదరులు పొగాకు మండేలను ఎప్పటి కప్పుడు తిరగ తిప్పాలని లేకపోతే పొగాకు దెబ్బతినే అవకాశం ఉందని తెలిపారు. అనధికారికంగా పొగాకు బోర్డు అనుమతి లేకుండా బ్యారన్లు నిర్మిస్తున్నారని, అలా నిర్మించడం పొగాకు బోర్డు చట్ట ప్రకారం నేరమని తెలిపారు. వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.



పొగాకు సాగు చేసే భూములను పరిశీలిస్తున్న అధికారులు

ఉద్యోగ సంఘాలు హర్షం

ప్రజాశక్తి-నెల్లూరు : కేంద్ర ప్రభుత్వం నూతన పన్ను విధానం అమలు చేస్తూ నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని పలు ఉద్యోగ సంఘాలు నేతలు పేర్కొన్నారు. కేంద్ర మంత్రి నిర్మలాసీతారామన్ ప్రవేశపెట్టిన నూతన పన్ను విధానం సంతోషకరమని ఉద్యోగ సంఘాల జేఏసి చైర్మన్ ఎం.పెంచలరావు పేర్కొన్నారు. ఉద్యోగులకు పెద్దగా న్యాయం జరిగేలా లేదని ఎపి హంస జిల్లా అధ్యక్షులు చేజర్ల సుధాకర్‌రావు పేర్కొన్నారు. ఆదాయపన్ను ప్రామాణిక తగ్గింపు హర్షంమని ఏపి ప్రభుత్వ ఉద్యోగుల అసోసియేషన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పివిఎస్‌టి రాంప్రసాద్, బి.సుధాకర్‌రెడ్డి తెలిపారు.

ప్రజలకు మెరుగైన సేవలు

ప్రజాశక్తి - లింగసముద్రం : లింగసముద్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కందుకూరు ఉప జిల్లా వైద్యాధికారిణి డాక్టర్ ప్రియంవద సందర్శించినారు. రికార్డులను పరిశీలించి తగు సూచనల చేశారు. కాన్పు గదిని, ల్యాబ్ గదిని సందర్శించి తగు సూచనలు సల హాలు ఇచ్చారు.ఎంపిహెచ్ఒ ఆరివుల్లా ,సిహెచ్ ఓ శ్రీనివాసులు,ల్యాబ్ టెక్నీషియన్ షహనా,స్టాఫ్ నర్స్ మాధవి, ఫార్మసిస్ట్ మాల కొండయ్య పర్యవేక్షకులు కుమారి పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న డిప్యూటీ డిఎం అండ్‌హెచ్ఓ

కార్యాలయంలో తనిఖీ

కందుకూరు : ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులకు మెరుగైన సేవలను అందిం చాలని జిల్లా ఉపఖజానాశాఖ కార్యాలయ ఉపసం చాలకులు. డి. గంగాద్రి అన్నారు. కందుకూరు ఉప ఖజానా శాఖ కార్యాలయాన్ని మంగళవారం తనిఖీ చేశారు. గంగాద్రి మాట్లాడుతూ రికార్డుల నిర్వహణ తీరుతెన్నుల గురించి సూచనలు చేశారు. ఏటిఓ శ్రీరామ ప్రగతి, ఎస్ టి ఓ విజయ్ కుమార్ ఉన్నారు.

బైక్ ప్రమాదంలో ఒకరు మృతి

వలేటివారిపాలెం: చుండి గ్రామంలో మోటార్ బైకు ఢీకొని వ్యక్తి మతి చెందిన సంఘటన సోమవారం అర్ధ రాత్రి జరిగినట్లు ఎస్ఐ బాల మహేందర్ నాయక్ తెలిపారు మతి చెందిన వ్యక్తి పోలినేని చెరువు గ్రామానికి చెందిన కర్నేటి మాల్యాద్రి సైకిల్‌పై రాత్రి 9 గంటలకు చుండి నుంచి పోలినేని చెరువు గ్రామానికి వెళ్తుండగా చుండి గ్రామంలోని ఎంపియుపి స్కూల్ ఎదురుకు వెళ్లేసరికి, ఎదురుగా చుండి గ్రామానికి చెందిన చెరువుపల్లి లక్ష్మయ్య తన బైక్‌ను అతివేగంగా నడుపుతుండగా కర్నేటి మాల్యాద్రి తలకు తీవ్రగాయం కావడంతో మృతిచెందాడు.కర్నేటి మాల్యాద్రి తల్లి ఆదెమ్మ ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కర్నేటి మాల్యాద్రి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కందుకూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

సాగు, తాగునీటి సమస్యలు తీర్చండి..!

- ❍ కందుకూరును తిరిగి ప్రకాశం జిల్లాలో కలపాలి
- ❍సిఎం చంద్రబాబు, మంత్రి లోకేష్‌కు ఎంఎల్ఎ 'ఇంటూరి' వినతి

ప్రజాశక్తి-కందుకూరు

కందుకూరు నియోజకవర్గంలో సాగు, తాగునీటి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత నివ్వాలని ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ గార్లను కలిసి విన్నవించారు. మంగళవారం ఎంఎల్ఎ నాగేశ్వరరావు, సచివాలయంలో ఇద్దరిని విడివిడిగా కలిసి వివిధ సమస్యలపై వినతి పత్రం ఇచ్చారు. కందుకూరు ప్రాంత రైతుల సాగునీటి అవసరాలు తీర్చే రాళ్లపాడు రిజర్వాయరుకు, సోమశిల ప్రాజెక్టు నుంచి నీరు సక్రమంగా విడుదల కావడం లేదని నాగేశ్వరరావు, సిఎం దష్టికి తీసుకువెళ్లారు. ప్రతి ఏటా సోమశిల నుంచి 1.5 టీఎంసీల నీరు విడుదల కావాల్సి ఉండగా, కొన్నేళ్ల నుంచి నీటి సరఫరా సరిగా లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రాళ్లపాడు రిజర్వాయర్ పూర్తిస్థాయిలో నిండితే ఖరీఫ్, రబీ సీజన్లలో రైతులకు ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు. తక్షణం రాళ్లపాడు ప్రాజెక్ట్ రిజర్వాయర్ కు నీటిని విడుదల చేసేలా ఆదేశాలు ఇవ్వాలని ఎమ్మెల్యే కోరారు. మరోవైపు పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు నుంచి, కందుకూరు నియోజకవర్గానికి ప్రత్యేక కెనాల్ ద్వారా నీటిని తరలించే అవకాశాన్ని పరిశీలించాలని ఎంఎల్ఎ నాగేశ్వరరావు, చంద్రబాబు మరియు మంత్రి నారా లోకేష్ ను అభ్యర్థించారు. వెలిగొండ తూర్పు ప్రధాన కాలువ నుంచి, ప్రత్యేకంగా కెనాల్ ఏర్పాటు చేస్తే... కందుకూరు నియోజకవర్గంలోని లింగసముద్రం, వలేటివారిపాలెం, కందుకూరు మండలాలకు సాగు,తాగునీరు అందించవచ్చని చెప్పారు. మూడు మండలాల్లోని 40 చెరువులను కష్ణా జలాలతో నింపడం ద్వారా, సుమారు 35 వేల ఎకరాలను కొత్తగా సాగులోకి తీసుకువచ్చే అవకాశం ఉందని వివరించారు. దీనివల్ల తాగునీటి సమస్య కూడా పూర్తిగా తీరుతుందన్నారు. నియోజకవర్గానికి ఉపయోగపడే ఈ అంశంపై వెంటనే దష్టి పెడతామని వారిద్దరూ నాగేశ్వరరావుకు హామీ ఇచ్చారు. ఎన్నికలకు ముందు హామీ ఇచ్చినట్టుగా, కందుకూరు నియోజకవర్గాన్ని తిరిగి ప్రకాశం జిల్లాలో కలిపే విధంగా చర్యలు తీసుకోవాలని నాగేశ్వరరావు విన్నవించారు.



సిఎం చంద్రబాబుకు వినతిపత్రం అందజేస్తున్న ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు

విద్యుత్ బిల్లుల చెల్లింపుపై అవగాహన

నెల్లూరు : వినియోగదారులు విద్యుత్ బిల్లులను యాప్స్ ద్వారా ఏ విధంగా చెల్లించాలో అవగాహన కల్పించే కార్యక్రమం విద్యుత్ రెవెన్యూ కార్యాలయంలో నిర్వహించారు. మంగళవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా పర్యవేక్షక ఇంజనీర్ వి. విజయన్ పాల్గొని వినియోగదారులకు అవగాహన కల్పించేందుకు అవసరమైన ప్రత్యేక కౌంటర్లను ప్రారంభించారు. ఎగ్జి క్యూటివ్ ఇంజనీర్ టౌన్ ఏ. సోమశేఖర్ రెడ్డి,సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ పి.మురళీ ఉన్నారు.

'ఉపాధి' పనులపై సమీక్ష

ప్రజాశక్తి-కందుకూరు : పట్టణంలోని విప్పగుంట రోడ్డులో ఉన్న సి ఎల్ అర్ సి కార్యాలయంలో ఉపాధి అధికారులు, సిబ్బందితో మంగళవారం సమీక్ష జరిపారు. ఈ సమీక్షలో ఎ పిడి బాబురావు మాట్లాడుతూ కూలీల సంఖ్యను పెంచే విధంగా చర్య లను చేపట్టాలని ఆదేశించారు. పనులు జరగని ఆయా మండలాల్లోని ఉన్న గ్రామాల్లో త్వరిత గతిన పనులను చేపట్టాలని చెప్పారు. కందుకూరు, వలేటి వారిపాలెం లింగసముద్రం ,గుడ్లూరు ఉలవపాడు ఏపీవోలు ఎల్ వి సుజాత, ఉమామహేష్, శామీర్ భాష, అబ్దుల్లా, వెంకటేశ్వర్లు ఉన్నారు.

శ్మశాన వాటికలో చెట్లు తొలగింపు

ప్రజాశక్తి-కందుకూరు శ్మశాన వాటికల అభివద్ధిలో భాగంగా ఆర్యవైశ్యుల విజ్ఞప్తి మేరకు ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు సూచనతో కందుకూరు పోతురాజుమిట్ట వద్ద ఉన్న హిందూ శ్మశాన వాటికలో చిల్ల చెట్లు, పిచ్చి మొక్కలను మున్సిపల్ సిబ్బంది తొలగించారు. ఆర్యవైశ్య నాయకులు కొత్తూరి సుధాకర్ రావు, కోటా కిషోర్, బొగ్గవరపు నరసింహం, బొగ్గవరపు బాల, ఇస్కాల సురేంద్ర ఉన్నారు.

బిసిజి వ్యాక్సిన్‌పై అపోహలొద్దు..!

వరిగొండ పిహెచ్‌సి డాక్టర్ రాధిక


ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు : బాసిల్లస్ కాల్మెట్-గురిన్ (బిసిజి) వాక్సిన్‌పై అపోహలొద్దనివరిగొండ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాధిక పేర్కొన్నారు. క్షయ (టీబీ) వ్యాధిని నివారించాలన్న ఉద్దేశ్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బిసిజి వాక్సిన్ వేస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మండలంలోని ఇస్కపాలెంలో బిసిజి వాక్సిన్ వేయించుకొన్న ఓ మహిళ మరో పురుషుడు ఒకింత అస్వస్థతకు గురయ్యారు. దీంతో బిసిజి వాక్సిన్ విషయంలో గ్రామస్తులు ఆందోళన చెందారు. ఈ విషయాన్ని ఆరోగ్య సిబ్బంది డాక్టర్ రాధిక దష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా డాక్టర్ రాధిక బిసిజి వ్యాక్సిన్‌పై వివరణ ఇచ్చారు. బిసిజి వ్యాక్సిన్ కారణంగా ఎటువంటి దుష్ప్రభావం గానీ, అనారోగ్య సమస్యలు గానీ తలెత్తవని డాక్టర్ రాధిక తెలిపారు. ఏ వాక్సిన్ అయినా వేసిన 24 గంటల్లో ప్రభావం కనిపిస్తుందే గాని వేసిన నెల, రెండు నెలలు తర్వాత కనిపించదని ఆమె తెలిపారు.

క్షయ ఒక అంటువ్యాధి :క్షయ (ట్యూబర్క్యులోసిస్) అనేది ఒక అంటు వ్యాధి అని, ఇది ఊపిరితిత్తులకు సంబంధించినదైనా, చర్మము నుంచి మెదడు వరకు శరీరంలో ఏ భాగానికైనా ఈ వ్యాధి వచ్చే అవకాశం ఉందని డాక్టర్ రాధిక తెలిపారు. దేశంలో దీర్ఘకాలిక రోగాలలో క్షయవ్యాధి ఒకటన్నారు. మైకోబాక్టీరియా లేదా మైకో బ్యాక్టీరియం ట్యూబర్క్యులోసిస్ అనే సూక్ష్మ క్రిమివల్ల ఈ వ్యాధి సంక్రమిస్తుందన్నారు. క్షయవ్యాధి సోకని శరీ రావయవాలు క్లోమము, థైరాయిడ్ గ్రంథి, జుట్టు. మిగిలిన అవయవాలన్నింటికి క్షయవ్యాధి కలిగే అవకాశం ఉందన్నారు. .



సిపిఎం సీనియర్ నేత 'నూతలపాటి'కి పరామర్శ

ప్రజాశక్తి-గుడ్లూరు : గత కొంతకాలంగా లివర్ సంబంధిత వ్యాధితో బాధపడుతూ హైదరాబాద్ యశోద హాస్పిటల్లో చికిత్స పొంది ఇంటికి వచ్చిన చేవూరు గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, సిపిఎం కందుకూరు డివిజన్ సీనియర్ నాయకులు నూతలపాటి. నరసింహంను సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు జాలా.అంజయ్య, సిపిఎం నెల్లూరు జిల్లా సీనియర్ నాయకులు ముప్పరాజు కోటయ్య, ప్రకాశం జిల్లా నాయకులు జి శ్రీనివాసులు, ఉలవపాడు కార్యదర్శి జివిబి కుమార్, వలేటివారిపాలెం మండలం పోకూరు శాఖా కార్యదర్శి దువ్వూరి జాన్, లింగసముద్రం శాఖా కార్యదర్శి పి కొండమ్మ, సిపిఎం చేవూరు శాఖా కార్యదర్శి ఇరు ఇరువురి బ్రహ్మయ్య, మండల నాయకులు నూతలపాటి వెంకటేశ్వర్లు, రామాయపట్నం నిర్వాసితులు ఉపేంద్ర తదితరులు పరామర్శించారు. సిపిఎం నాయకులు మాట్లాడుతూ నూతలపాటి నరసింహం1981 నుంచి 87 వరకు సిపిఎం తరపున గెలిచి గ్రామ సర్పంచ్‌గా చెవూరు గ్రామ అభివద్ధికి అహర్నిశలు కృషి చేశారని పేర్కొన్నారు. తన తర్వాత సిపిఎం తరపున మరో ఇద్దరిని సర్పంచులుగా గెలిపించి 2021 వరకు సుమారు 20 ఏళ్లు సిపిఎం ఆధ్వర్యంలో ప్రజలకు ఎనలేని సేవలు అందించారని తెలిపారు.కమ్యూనిస్టు నరసింహంగా కందుకూరు ప్రాంతంలో అన్ని వర్గాల ప్రజల మనసులను గెలిచారని తెలిపారు. చేవూరులోనూ రాజకీయాలకతీతంగా ప్రజలకు ఏ కష్టం వచ్చినా ఆ కష్టంలో ఉండేవాడని, పరిష్కరించేవారని తెలిపారు.ఆయన అనారోగ్యంనుంచి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.



నూతలపాటి నరసింహంనును పరామర్శిస్తున్న సిపిఎం నాయకులు

23 నుంచి 27 వరకు
ఎపిఈఎపి సెట్ తుదిదశ కౌన్సిలింగ్


ప్రజాశక్తి - నెల్లూరు : ఎపిఈఎపి సెట్ తుదిదశ కౌన్సిలింగ్ ఈనెల 23 నుంచి 27వ తేదీ వరకూ ఆన్‌లైన్ పద్ధతిలో జరుగుతుందని వెంకటేశ్వరపురంలోని ప్రభుత్వ బాలుర పాలిటెక్నిక్ కళాశాల అడ్మినిస్ట్రేటివ్ అధికారి దంపూరి శివకుమార్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడారు. ఈ కౌన్సిలింగ్ ప్రక్రియ ఇంజినీరింగ్ కోర్సులలో మొదటి సంవత్సరం ప్రవేశాలకు కోసం జరుగుతుందన్నారు. ఈ కౌన్సిలింగ్ జరిగే విధానం, విద్యార్థులు అనుసరించాల్సిన విషయాల గురించి ఆయన పలు సూచనలు చేశారు. మొదటి కౌన్సిలింగ్‌లో రిజిస్ట్రేషన్ రుసుము చెల్లిం చనివారు ఈ రిజిస్ట్రేషన్‌లో చెలించవచ్చుని తెలిపారు. ప్రాసెసింగ్ రుసుము ఈ నెల 25 వరకు చెల్లించవచ్చున్నారు. రుసుము చెల్లించి రిజిస్ట్రేషు అయిన వారికి సర్టిఫికెట్లు వెరిఫికేషన్ ఆన్‌లైన్‌లో జరుగుతుం దన్నారు. మొదటి కౌన్సిలింగ్‌లో సీటు పొంది మరొక సీటు మార్చుకొనేందుకు ఆప్షన్స్ జులై 24వ తేదీ నుంచి 26 జులై వరకు ఉందని తెలిపారు. ఆదాయ ధ్రువ పత్రం 01-01-2021 తర్వాత నమోదు పత్రాలు మాత్రమే సమర్పించాలన్నారు. మొదటి కౌన్సిలింగ్‌లో సీటు పొందిన వారు తుది కౌన్సిలింగ్ లో కళాశాల, సీటునీ రెండింటినీ మార్చుకోవచ్చని తెలిపారు. విద్యార్థులు బయట వ్యక్తుల మాటలు నమ్మొద్దని, పూర్తి సమాచారం కోసం కేవలం http://cets.apsc.ap.gov.in వెబ్ సైట్‌లోనే తెలుసుకోవాలని సూచించారు.



దంపూరి శివకుమార్

వ్యక్తిగత పరిశుభ్రత అవసరం

ప్రజాశక్తి - లింగసముద్రం : మండలంలోని పెద్దపవనిలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 'గురుకులం'లో మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పెంచలయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. పిల్లలకు వ్యక్తిగత శుభ్రత గురించి, మెడిటేషన్ గురించి, హ్యాండ్ వాష్, పౌష్టికాహారం గురించి, ఏడు ఆరోగ్య సూత్రాలు గురించి, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఫ్లోరోసిస్‌పై డాక్టర్ దివ్య ఫ్లోరోసిస్ గురించి పిల్లలకు అవగాహన కల్పించారు. గురురుకులం పాఠశాలలో చెట్లు నాటే కార్యక్రమం చేపట్టారు. ప్రిన్సిపల్ స్నేహలత, లింగసముద్రం డాక్టర్ అనురాధ అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. స్కూల్లో పిల్లలందరకి హెచ్.బి టెస్టులు చేశారు. డాక్టర్ పెంచలయ్య అంబేద్కర్ గురుకులం పరిసరాల పరిశుభ్రత, శానిటేషన్ ,నిర్వహణ పై సంతప్తిని వ్యక్తం చేశారు. ఎంఎల్ హెచ్ పి ఖాదర్, పరిమళ, ఏఎన్ఎంలు కష్ణవేణి, అంకమ్మ, యశోద ఆరోగ్య కార్యకర్త యం.జోగేశ్వరరావు, ఆశా కార్యకర్త సుల్తాన్ బి పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న డిఎంఅండ్ హెచ్ఓ పెంచలయ్య

పలు గ్రామాల్లో గ్రామసభలు

ప్రజాశక్తి - లింగసముద్రం : లింగసముద్రం, తిమ్మారెడ్డి పాలెం, గంగపాలెం మాల కొండరాయునిపాలెం గ్రామపంచాయతీలో మంగళవారం గ్రామసభలు నిర్వహించారు. జలజీవన్ మిషన్, హర్ ఘర్ జల్,ఎస్బిఎం అంశాలపై గ్రామ సభలో చర్చించారు. ఎంపిడిఓ కట్టా శ్రీనివాసులు మాట్లాడుతూ జలజీవన్ మిషన్ ద్వారా గ్రామంలోని ప్రతి ఇంటికి నీటి కుళాయిలు ఏర్పాటు చేయాలని ప్రతి ఇంటిలో మరుగు దొడ్లు నిర్మించుకోవాలన్నారు. నిరంతరం బ్లీచింగ్ తల్లుతూ స్వచ్ఛమైన నీటిని అందించాలని తెలిపారు. లింగసముద్రం సర్పంచ్ పులి రాఘవులు, మాలకొండ రాయుని పాలెం సర్పంచ్ వంటేల శ్రీనివాసులు, యుపిఆర్‌డి కెవి. రామసుబ్బారావు, పంచా యతీ కార్యదర్శులు మాధవరావు, గౌస్, పూర్ణచంద్రరావు, లక్ష్మీనారాయణ ఉన్నారు.



గ్రామ సభలో మాట్లాడుతున్న ఎంపిడిఓ

డిగ్రీ కోర్సులు ప్రారంభం

వెంకటాచలం : మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న విక్రమ సింహపురి యూనివర్సిటీ విశ్వవిద్యాలయంలో 2024-25 విద్యా సంవత్సరం నుంచి 4 యూజీ డిగ్రీ కోర్సులు ప్రారంభిస్తున్నట్లు విశ్వవిద్యాలయం రిజిస్టర్ డాక్టర్ కె.సునీత మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. బిఎస్‌సి హన్సర్ ఫిజిక్స్-50 సీట్లు, బికాం ఆన్సర్ కంప్యూటర్ అప్లికేషన్స్-60 సీట్లు, బిబిఎ లాజిస్టిక్స్ -60 సీట్లు,బీఎస్సీ ఆన్సర్ స్టాటిస్టిక్స్ నందు 50 సీట్లు ఉన్నాయన్నారు.

విద్యారంగంలో సమస్యలను పరిష్కరించాలి

పలుచోట్ల యుటిఎఫ్ ఆధ్వర్యంలో వినతిపత్రాలు అందజేత





ఉదయగిరి, సీతారామపురం మండలాల్లో వినతిపత్రాలు అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి-ఉదయగిరి

పాఠశాల విద్యారంగంలో నెలకొన్న సమస్యలకు సత్వర పరిష్కారం చూపాలని యుటిఎఫ్ మండల శాఖ నాయకులు మంగళవారం తహశీల్దార్ నెహ్రూబాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిఒ నెంబర్ 117ను రద్దు చేయాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఒకే సిలబస్, ఒకే పరీక్షా విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుంచి మినహాయించి, పనిభారం తగ్గించాలని కోరారు. అందులో భాగంగా ఎంఇఒ, ఎంపిడిఒలకు డిమాండ్‌ల పత్రాలను అందజేశామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు కె.చంద్రశేఖర్ రెడ్డి, మండల అధ్యక్షులు షేక్.హనీఫ్, ప్రధాన కార్యదర్శి ఫణిరాజు, సుబ్బారెడ్డి, దుర్గా ప్రసాద్, మున్నా, వెంకట్ రెడ్డి, ఉదయ్ కుమార్, రామకృష్ణ, తదితరులు ఉన్నారు.

ప్రజాశక్తి-సీతారామపురం : రాష్ట్రంలో అమలు జరిపిన విద్యారంగ సంస్కరణల ఫలితంగా రాష్ట్ర విద్యారంగం అస్థవ్యస్థంగా మారిందని పాఠశాల విద్యా రంగంలో అనేక మార్పులు జరపాలని యుటిఎఫ్ నాయకులు కోరారు. ఆ మేరకు మండల యుటిఎఫ్ ఆధ్వర్యంలో నాయకులు ఎంఇఒ మస్తాన్‌వలీ, ఎంపిడిఒ అబ్దుల్‌కలాం ఆజాద్, తహశీల్దార్ కార్యాలయ సిబ్బందికి వినతి పత్రాలను అందజేశారు. ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రుల ఆశలు సన్నగిల్లున్నాయని ప్రభుత్వ పాఠశాలలు నిర్వీర్యం అవుతున్నాయని, పరిస్థితులు వ్యతిరేకంచక ముందే పాఠశాల విద్యా రంగంలో మార్పులు తీసుకురావాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. అధిక పనిభారంతో పాటు అనేక సమస్యలు పరిష్కారం కాక ఉపాధ్యాయులు తీవ్ర అసంతృప్తిలో ఉన్నార న్నారు. జిఒ నెంబర్ 117ను రద్దుచేసి జిఒ నెంబర్ ఎంఎస్ 55 ప్రకారం టీచర్లను కేటాయించాలన్నారు. ప్రీ ప్రైమరీ స్కూళ్లతో కలిపి 1 నుండి 5 తరగతులను ఒకే పాఠశాలలో నడిపించాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఒకే సిలబస్ ఒకే పరీక్ష విధానం నిర్వహించాలన్నారు. హైస్కూల్‌లో రెండు మీడియాలను సమానంగా నిర్వహించాలన్నారు. ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుండి తప్పించి పనిభారం తగ్గించాలన్నారు. హైస్కూళ్లలో బోధనేతర సిబ్బందిని నియమించాలన్నారు. ఒక కిలోమీటర్ దూరం పైబడిన విద్యార్థుల కోసం ఉచిత రవాణా సౌకర్యాలు కల్పించి పరిస్థితులకు అనుకూలంగా మధ్యాహ్నం భోజన మెనూ మార్చాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ ఉన్నత పాఠశాలలో టీచర్ల పోస్టులను అప్‌గ్రేడ్ చేసి, బదిలీలు ప్రమోషన్లను జరిపి మున్సిపల్ పాఠశాలల్లో సిబ్బందికి పిఎఫ్‌ను సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గిరిజన ప్రాంతాలలో ప్లస్‌టు స్కూళ్లను ఏర్పాటు చేసి పాఠశాలల్లో సిఆర్‌టిలు భాష వాలంటీర్లను రెగ్యులర్ చేయాలన్నారు. కరోనా సమయంలో మరణించిన మోడల్ స్కూల్ టీచర్ల వారసులకు కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలు కల్పించాలన్నారు. మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు సర్వీస్ రూల్స్‌ను వెంటనే విడుదల చేసి పిజిటిలకు జూనియర్ లెక్చరర్ హోదా కల్పించాలని డిమాండ్ చేశారు. ఇటువంటి అనేక సమస్యలను పరిష్కరించాలని వారు కోరారు. కార్యక్రమంలో యుటిఎఫ్ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బోగ్యం శ్రీనివాసులు, గోడ్లవీటి వెంకటేశ్వర్లు, నాయకులు బాలకృష్ణారెడ్డి, శ్రీనివాసులు, లక్ష్మయ్య, ఆనందీశ్వరయ్య, కొండయ్య, ప్రసాద్, నరసింహారాజు పాల్గొన్నారు.



నాగబాబు, అజయ్‌కుమార్‌లతో మల్లికార్జునయాదవ్

నాగబాబును కలిసిన నూనె మల్లికార్జున యాదవ్

ప్రజాశక్తి-నెల్లూరు

జనసేన పార్టీ అధినేత, డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ ఆదేశాల మేరకు జిల్లా జనసేన నేత, కోర్ కమిటీ సభ్యుడు నూనె మల్లికార్జున యాదవ్ చేపట్టిన సభ్యత్వ నమోదు కార్యక్రమం విజయవంతంగా నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి కొణిదెల నాగబాబును ఆ పార్టీ జాతీయ మీడియా అధికార ప్రతినిధి వేములపాటి అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నాగబాబు మాట్లాడుతూ జిల్లాలో పార్టీ పట్టిష్టతకు కృషి చేయాలని సూచించారు. పేద ప్రజలకు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో సయ్యద్ ఆజాద్ జమీర్, లాయర్ శ్రీరామ్, గునుకుల కిషోర్, వై.రవి, గుర్రం కిషోర్, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు



ప్రజాశక్తి-మర్రిపాడు : మండలంలోని చుంచులూరు ఉన్నత పాఠశాలలో గత సంవత్సరం జరిగిన పదవ తరగతి పరీక్షల్లో మొదటి నాలుగు స్థానాలు సాధించిన కరిశెట్టి జ్యోతిక, ఇందూరు లక్ష్మీప్రసన్న, పవన్ కళ్యాణ్, వనం వితతలకు చింతలరెడ్డి సిద్ధారెడ్డి, జయమ్మల కుమారుడు, పాఠశాల పూర్వ విద్యార్థి, ప్రవాస భారతీయుడు సుదర్శన్ రెడ్డి రూ.12వేల నగదు బహుమతులు, మెమెంటోలు అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అబ్దుల్ వేదక రూ.22వేల విలువ చేసే ప్రింటర్‌ను పాఠశాలకు బహూకరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుధాకర్ మాట్లాడుతూ దాతృత్వం ప్రోత్సహించడానికి, పాఠశాల అభివృద్ధికి సహకరించడానికి దాతలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. విద్యార్థులు దాతల సహకారాన్ని అందిపుచ్చుకొని ఉన్నతస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. విశ్రాంత ప్రధానోపాధ్యాయులు కరిశెట్టి వెంకట రమణయ్య, తంగేడుపల్లి సుబ్బయ్య, మల్లేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

పుట్టగొడుగుల పెంపకంపై శిక్షణ

ప్రజాశక్తి-ఉదయగిరి : ఆర్య పథకంలో భాగంగా సస్యరక్షణ శాస్త్రవేత్త డాక్టర్ డి.విజయ్‌కుమార్ నాయక్ పుట్టగొడుగుల పెంపకం ఒక రోజు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళవారం కృషి విజ్ఞాన కేంద్రం నెల్లూరులో వివిధ రకాల పుట్టగొడుగుల గురించి వాటిని పెంచే విధానం గురించి ఆయన వివరించారు. అనంతరం గృహ విజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ సుజాత పుట్టగొడుగుల ఆవశ్యకత వాటి ఉత్పాదకాలు గురించి వివరంగా తెలిపారు. ఈ ఆర్య పథకంలో గ్రామీణ యువతకు శిక్షణ ఇచ్చినట్లు కె.వి.కె సమన్వయకర్త డాక్టర్ జి.ఎల్.శివజ్యోతి తెలిపారు. శాస్త్రవేత్తలు లోకేష్ బాబు, కిరణ్ కుమార్ రెడ్డి, అనుషా, రైతులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన ఎంఎల్ఎ కావ్యకృష్ణారెడ్డి



ప్రజాశక్తి-కావలి : కావలి నియోజకవర్గ మత్స్యకార నేతలతో కలిసి కావలి ఎంఎల్ఎ కావ్య క్రిష్ణారెడ్డి మంగళవారం రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి బిసి జనార్దన్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. కావలి నియోజక వర్గంలోని రోడ్ల దుస్థితిని ఎంఎల్ఎ కావ్య క్రిష్ణారెడ్డి మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. కావలి నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని మంత్రిని కోరారు. ఆయన స్పందించిన మంత్రి తప్పక సహకరిస్తానని తెలిపారు. కార్యక్రమంలో కావలి రూరల్ మండల అధ్యక్షులు ఉప్పల రామకృష్ణ, రాష్ట్ర మత్స్యకార సాధికార సమితి సభ్యులు సోమయ్యగారి రమణ, కుర్ర కొండయ్య, ప్రొద్దన రావు, శ్రీను బాబు పాల్గొన్నారు.

గణితంపై మక్కువ పెంచుకోవాలి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : విద్యార్థులు గణితంపై మక్కువ పెంచుకోవాలని ప్రధానోపాధ్యాయిని అనంతలక్ష్మి పేర్కొన్నారు. శిక్షాసప్తాహ్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం పునాది అభ్యసన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు గణితం, భాషకు సంబంధించిన నమూనాలు తయారు చేశారు. ఈ సందర్భంగా పురస్కరించుకొని ప్రధానోపాధ్యాయిని అనంతలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులు గణితంపై మక్కువ పెంచుకున్నట్లయితే గణితం సులువుగా వస్తుందన్నారు. గణితంతో విద్యార్థులకు మానసిక ఆనందంతోపాటు సృజనాత్మకత అలవడుతుందన్నారు. భాషలో కనీస అభ్యసన స్థాయిలను సాధించేలా విద్యార్థులు తయారు కావాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంటి పరిసరాలు శుభ్ర పరచాలి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : ఇంటిని, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అస్మా తెలియజేశారు. మంగళవారం యుహెచ్‌సి మెడికల్ ఆఫీసర్ సిబ్బందికి సెక్టార్ మీటింగ్ నిర్వహించారు. పలు సలహాలు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా డాక్టర్ అస్మా మాట్లాడుతూ ఫ్రైడేను డ్రైడేగా పాటించాలని, ఇంటిని ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని అవగాహన కల్పించాలన్నారు. ఎంపిహెచ్ఇఒ ఎస్.సుధాకర్, యు.పార్వతమ్మ, ఎఎన్ఎంలు, ఆశావర్కర్లున్నారు.

హామీ నెరవేర్చిన మంత్రి 'ఆనం'

ప్రజాశక్తి-అనంతసాగరం : జూలై 1న అనంతసాగరం గ్రామంలోని పెన్షన్ల కార్యక్రమానికి స్థానిక శాసనసభ్యులు, రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఇద్దరు వికలాంగులకు పెన్షన్లు పంపిణీ చేసిన విషయం విదితమే. ఈ వికలాంగులు తమకు రెండు చేతి కర్రలు కావాలని మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని అభ్యర్థించారు. మంత్రి హామీ మేరకు ఇద్దరు వికలాంగులకు చేతికర్రలు నాయకులు వల్లి అహ్మద్, జావేద్ యూత్, స్థానికులు అందజేశారు. ఈ మేరకు మంత్రి ఆనంకు కృతజ్ఞతలు తెలిపారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

ప్రజాశక్తి-కావలి : కావలి పాతూరు మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఎంఇఒ-1 బండి గోవిందయ్య మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా వంటగదిని తనిఖీ చేసి, మధ్యాహ్న భోజనాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుబ్బారావు, ఉపాధ్యాయులతో కలిసి రుచిచూసి, వంటవారికి తగుసూచనలు ఇచ్చారు.

సర్వాయపాలెంలో 'శిక్షా సప్తాహ్'

ప్రజాశక్తి-కావలి : మండలంలోని సర్వాయపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మంగళవారం "శిక్షా సప్తాహ్" కార్యక్రమంలో భాగంగా 'పునాది అభ్యసన, సంఖ్యాజ్ఞానం, నైపుణ్యాల అభివృద్ధి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సమాజ భాగస్వామ్యంతో తల్లిదండ్రులకు పునాది అభ్యసనం, సంఖ్యాజ్ఞాన నైపుణ్యాల అభివృద్ధి గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొని విజయవంతం చేశారు.

జనసేన సభ్యత్వం నమోదు

ప్రజాశక్తి-కావలి : జనసేన పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా క్రియాశీలక సభ్యత్వాలు నమోదు విడత నమోదు కార్యక్రమం అత్యుత్సాహంగా జరుగుతుండగా జనసేన నాయకులు తెలిపారు. ఈ సభ్యత్వాలను జనసేన పార్టీ నేతలు కార్యకర్తలు వీరమహిళలు, పవన్‌కళ్యాణ్ అభిమానులు పెద్దసంఖ్యలో సభ్యత్వాలు పొందారని, జనసేన జిల్లా కార్యదర్శి సమ్మెట వెంకటసుబ్బయ్య, పవన్ కళ్యాణ్ ఫ్యాన్స్ కావలి పట్టణ అధ్యక్షులు అలా శ్రీనాథ్ వెల్లడించారు. మంగళవారం పట్టణంలోని స్థానిక జర్నలిస్టు క్లబ్‌లో పత్రిక విలేకరుల సమావేశం నిర్వహించారు. జనసేన ముఖ్య నాయకులు గుంటుపల్లి కృష్ణయ్య, పాలకూరు వెంకటేశ్వర్లు, భాస్కర్ పాల్గొన్నారు.

పాఠశాలలో ఎంఇఒ సందర్శన

ప్రజాశక్తి-అనంతసాగరం : శిక్షా సప్తాహ్ రెండవ రోజు మంగళవారం ఎపిఎస్ఎల్‌ఎస్‌టిలో భాగంగా ఎంఇఒ-2 కాటంరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఎపిఎస్ఎస్ మినగల్లు మెయిన్ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా శిక్షా సప్తాహ్, విద్యాప్రవేశ కార్యక్రమం అమలు తీరును, విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. పలు రికార్డులను, రిజిస్టర్లను పరిశీలించి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఇచ్చిన అక్షరాలతో పదాల నిర్మాణం, ఇచ్చిన అంకెలతో 2/3అంకెల సంఖ్యల నిర్మాణం, గేయాలను, కథలను అభినయంతో చెప్పడం వంటి పలు కృత్యాలను పరిశీలించి విద్యార్థులను అభినందించారు.

గిరిజనులకు అన్నదానం

ప్రజాశక్తి-కావలి : అన్నమయ్య జిల్లా, టి.సుండుపల్లి మండలం, పెద్ద బలిజపల్లి గ్రామ నివాసులు అన్నయ్యగారి.ఉదయ్‌కుమార్ - లావణ్య దంపతుల కుమార్తె చిన్నారి శివపాల్గొని మొదటి పుట్టిన రోజు సందర్భంగామంగళవారం సంయుక్త సేవాసంస్థ ఆధ్వర్యంలో ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర ద్వారా సర్వాయపాలెం గిరిజనులకు అన్నదానం చేశారు. పుట్టినరోజు జరుపుకుంటున్న చిన్నారి శివ పాల్గొని సంయుక్త సేవా సంస్థ ద్వారా శుభాకాంక్షలు తెలియజేశారు.

అన్న క్యాంటీన్ నిర్మాణ పనులు పరిశీలన

ప్రజాశక్తి-కావలి : కావలి ఎం.ఎల్.ఎ. దగుమాటి వెంకట కృష్ణారెడ్డి ఆదేశాల ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న "అన్న క్యాంటీన్" పనులకు సంబంధించిన నిర్మాణాలను మంగళవారం మున్సిపల్ కమిషనర్ జి.శ్రావణ్‌కుమార్ పరిశీలించారు. కావలి తహశీల్దార్ ఆఫీస్ కాంపౌండ్‌లో ఉన్న అన్న క్యాంటీన్‌కు సంబంధించిన పనులను శరవేగంగా పూర్తి చేయాల్సిందిగా అధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనులకు సంబంధించి కావలి కొత్త శివాలయం, వెంగయ్యగారిపాలెంలో జరుగుతున్న పంట కాలువ పూడిక పనులను, రోడ్డు మార్జిన్ పనులను కావలి కమిషనర్ ఆయనే స్వయంగా పర్యవేక్షించారు. కార్యక్రమంలో కావలి మున్సిపల్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన కౌలురైతుల గ్రామసభ

ప్రజాశక్తి-అనంతసాగరం : మండలంలో 12వ తేదీ నుంచి ప్రారంభమైన కౌలు రైతుల గ్రామసభలు మంగళవారంతో ముగిసినట్లు వ్యవసాయ అధికారి శ్రీనివాస చక్రవర్తి తెలిపారు. మండలంలోని చిలకలమర్రి, అగ్రహారం గ్రామాలలో కౌలు రైతుల గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా పంట సాగుచేస్తున్న పత్రాలపై రైతులకు సూచనలు సలహాలు ఇచ్చారు. ప్రతి కౌలు రైతు పంటసాగు హక్కు పత్రాలు కచ్చితంగా తీసుకోవాలన్నారు. అనంతరం వరి, సజ్జ, మినుము, పంటలను వ్యవసాయ అధికారి పరిశీలించారు. ఈ సీజన్‌లో వీటికి పిచికారి చేయాల్సిన మందులపై రైతులకు సూచనలు సలహాలు ఇచ్చారు. మండల ఉద్యానవన అధికారి రాజశేఖర్, అగ్రికల్చర్ అసిస్టెంట్ మల్లెల కొండయ్య, రైతులు పాల్గొన్నారు.

రాష్ట్రానికి బడ్జెట్ కేటాయింపులపై హర్షం

- టిడిపి యువనేత పిడికిటి వెంకటేశ్వర్లు నాయుడు



ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

దేశంలోనే ఆంధ్ర రాష్ట్రం ప్రథమ స్థానంలో నిలుస్తుందని చెప్పడానికి నేటి కేంద్ర ప్రభుత్వం ఆంధ్ర రాష్ట్రానికి కేటాయించిన నిధుల కేటాయింపే ప్రత్యక్ష సాక్ష్యమని టిడిపి జిల్లా మాజీ ఉపాధ్యక్షులు, టిడిపి యువనేత పిడికేటి వెంకటేశ్వర్లు నాయుడు పేర్కొన్నారు. నేడు కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి భారీగా నిధులు కేటాయింపు చేయడం, రాష్ట్ర అభివృద్ధికి ఎంతో దోహదపడుతుందన్నారు. ఎన్‌డిఎ కూటమిలో ప్రధాన పార్టీగా ఉన్న టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడు కేంద్ర ప్రభుత్వంలో తనకున్న ప్రాధాన్యతకు ఈ నిధుల కేటాయింపే నిదర్శనమన్నారు. ముఖ్యంగా అమరావతి అభివృద్ధికి రూ.15వేల కోట్లు కేటాయించడం, పోలవరాన్ని కేంద్ర ప్రభుత్వం పూర్తిగా నిర్మించేందుకు ఒప్పుకోవడం రైల్వేశాఖకు బడ్జెట్ కేటాయింపు రాష్ట్రంలోని వివిధ అభివృద్ధి పనులకు అత్యధిక బడ్జెట్ కేటాయింపు చేయడం ఆంధ్ర రాష్ట్ర అభివృద్ధికి ఎంతో దోహదపడుతుందని తెలియజేశారు. దాంతో దేశంలోనే ఆంధ్ర రాష్ట్రం ప్రథమ స్థానంలో నిలుస్తుందని వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ నేపథ్యంలో ఆత్మకూరు శాసనసభ్యులు, దేవాదాయ శాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి కూడా ఆత్మకూరు నియోజకవర్గ అభివృద్ధికి ఎంతో దోహదపడతారని ఆశిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఆయనకు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు, ఎన్‌డిఎ ప్రభుత్వానికి ఆత్మకూరు పట్టణ ప్రజల పక్షాన ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు.



మాట్లాడుతున్న సి.శారద

హత్యాచారాలను ఖండించాలి

ప్రజాశక్తి-కావలి

రాష్ట్రంలో ఒక్క జులైలోనే జరిగిన వరుసవెంట హత్యాచారాలను ఖండించాలని కావలి ఉమెన్స్ ఫోర్స్, జమాతే ఇస్లామీ హింద్ సంస్థలకు చెందిన మహిళా నాయకులు, బాధ్యులు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక "జర్నలిస్ట్ క్లబ్"లో కావలి ఉమెన్ ఫోర్స్ - జమాయతి ఇస్లామి ఇ హింద్‌లు మీడియా సమావేశం నిర్వహించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం తక్షణ ఎక్స్‌గ్రేషియో అందించాలని, ప్రజాతంత్ర వాదులు, హక్కుల సంఘాలు ఈ దుర్ఘటనలను సమైక్యంగా ఖండించాలన్నారు. ఈ సందర్భంగా కావలి ఉమెన్ ఫోర్స్, జమాయతే ఇస్లామి ఇ హింద్ సభ్యులు సి.శారద, ఫాతిమా, నూర్జహాన్, టి.లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల అభివృద్ధికి తోడ్పడాలి : డిఇఒ

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్



మాట్లాడుతున్న డిఇఒ పి.వి.జె. రామారావు

విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ఉపాధ్యాయులు తోడ్పడాలని డిఇఒ పి వి జె రామారావు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఎపి గురుకుల విద్యాలయం - బాలికల ప్రాంగణంలో ఆత్మకూరు డివిజన్‌లో జరుగుతున్న సపోర్టింగ్ ఆంధ్రాస్ లెర్నింగ్ ట్రాన్స్‌ఫర్‌మేషన్ కార్యక్రమంలో భాగంగా "టీచ్ టూల్" 5వ రోజు శిక్షణా కార్యక్రమాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుడు తమ బోధనలో బహుళ నైపుణ్యాలను కలిగి ఉండాలని, ప్రతి విద్యార్థికి అర్థమయ్యే రీతిలో బోధన చేసి విద్యార్థులను ఆల్‌రౌండ్ డెవలప్‌మెంట్ సాధించే విధంగా బోధన చేయాలని సూచించారు. జిల్లాలో మూడవ విడతలో 4 డివిజన్లో 553మంది పరిశీలకులుగా 9రోజుల పాటు శిక్షణ పొందుతున్నారని 9రోజులు శిక్షణ పొందుతున్న పరిశీలకులు ఒక్కొక్కరు 15మంది ఉపాధ్యాయుల బోధనలను పరిశీలించాలని తెలిపారు. ఉపాధ్యాయులకు వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించడానికి ఉపయోగపడుతుందన్నారు. శిక్షణ పొందిన పరిశీలకులు ప్రతిఒక్కరూ టీచ్ టూల్ ఆధారంగా తరగతి గదిలో బోధించే ఉపాధ్యాయులను, విద్యార్థులను, పారదర్శకంగా పరిశీలించాలని సూచించారు. ఆత్మకూరు ఎపిఆర్ఎస్ గురుకుల పాఠశాలలో 2023-24 విద్యా సంవత్సరంలో పదో తరగతిలో నూరుశాతం ఉత్తీర్ణత సాధించినందుకు పాఠశాల ప్రిన్సిపాల్ కామేశ్వరికి అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా ఉప విద్యాశాఖ అధికారి ఆత్మకూరు కె.గోపాల్, జిల్లా సమగ్ర శిక్ష విద్యా విషయక పర్యవేక్షణ అధికారి జి.సుధీర్‌బాబు, శిక్షణా తరగతుల ఇన్‌ఛార్జి మండల విద్యాశాఖ అధికారులు ఎం.జ్యోతి, కె.చలపతి, మాస్టర్ ట్రైనీలు ఎ.సురేష్, టి.నాగేశ్వరరావు, పి.కేశవనారాయణ, కిరణ్ కుమార్, మస్తానయ్య, ఖాదర్‌బాషా, సిఆర్‌పిలు, డివిజన్‌స్థాయి ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



టిడిపి హయాంలోనే రాజధాని, పోలవరం నిర్మాణం

ప్రజాశక్తి-ఉదయగిరి : కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌తో ఆంధ్ర రాష్ట్రానికి రాజధాని, పోలవరం నిర్మాణాలు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబుతోనే ముందుకు సాగడం సాధ్యమైందని టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ జెడ్‌పి మాజీ చైర్మన్ పి.చెంచలబాబుయాదవ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వం కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్లో అమరావతికి రాష్ట్ర రాజధాని నిర్మాణానికి రూ.15వేల కోట్లు మంజూరు చేయడం పోలవరం ప్రాజెక్టుకు పూర్తిగా సహకరిస్తామని తెలియజేయడం సంతోషదాయకమన్నారు. రాయలసీమ జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీని ప్రకటించడం విశాఖ పట్నంకు ప్రత్యేక కారిడార్ ప్రకటించడం రైతులకు బడ్జెట్లో లక్షా 40 వేల కోట్లు ప్రకటించడం రాష్ట్రానికి ఈ బడ్జెట్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ముఖ్యమంత్రి అయిన తక్షణమే ముఖ్యమంత్రిగా రాష్ట్రానికి బడ్జెట్లో సముజిత స్థానానికి కృషి కల్పించారని రాష్ట్ర అభివృద్ధి నారా చంద్రబాబు నాయుడుతోనే సాధ్యమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

'శ్రీ చైతన్య' విద్యార్థుల ప్రభంజనం



ప్రజాశక్తి-కావలి : విక్రమ సింహపురి యూనివర్సిటీ విడుదల చేసిన డిగ్రీ 5వ సెమిస్టర్ ఫలితాలలో పట్టణంలోని శ్రీ చైతన్య డిగ్రీ కళాశాల విద్యార్థులు బి.స్.సి, బి.కాం, బి.ఎ, బి.సి.ఎ కోర్సులలోనీ అన్ని గ్రూపులలో యూనివర్సిటీ స్థాయిలో ఉత్తమ మార్కులను, పట్టణ స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను సాధించి టాపర్స్‌గా నిలిచారు. 5వసెమిస్టర్ ఫలితాలలో బి.ఎస్.సి (ఎం.ఎస్.సి.స్)లో ఎస్.డి.అయేషా 9.73, ఎన్.మీనంజలి 9.52, జె.దీపక్ 9.23. పాయింట్లతో పట్టణ ప్రథమ, ద్వితీయ , తృతీయ స్థానాలను సాధించారు. బి.ఎస్.సి (ఎం.పి.సి.ఎస్) విభాగంలో షైక్ షాలిమ 9.13, జి.ప్రవీణ 9.11.బి.ఎస్.సి (బి.సి.సి.ఏ) విభాగంలో ఎ.నాగ లక్ష్మి జ్యోతిక 9.38, ఎం.వీణ పని 9.35.బి.సి.ఎ. విభాగంలో బీ.తేజస్విని 9.08 బీకాం విభాగంలో ఎం.కృష్ణవంశీ 9.22, యు.కవిత 9.06. బి.ఎ (ఎకనామిక్స్) విభాగంలో ఎం.శోభారాణి 8.95, వై.బ్లెస్సీ బ్యూలాహ్ 8.95 అత్యున్నత మైన పాయింట్లను సాధించారు. అత్యుత్తమైన మార్కులు సాధించిన విద్యార్థులకు పుష్పగుచ్ఛాలను అందించి అభినందించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ డాక్టర్ బెజవాడ రవికుమార్, కళాశాల డైరెక్టర్స్ పి.జానకిరామ్, అకడమిక్ ప్రిన్సిపాల్ పి.వి.రావు, నాక్ ప్రిన్సిపాల్ రవికాంత్, అధ్యాపక, అద్యాపకేతర సిబ్బంది పాల్గొని విద్యార్థులను అభినందించారు.

పాఠశాలలో డిఇఒ సందర్శన

ప్రజాశక్తి-సంగం : మండలంలోని పడమటిపాలెం మెయిన్ స్కూల్‌ను మంగళవారం జిల్లా విద్యాశాఖాధికారి రామారావు సందర్శించారు. పాఠశాలలో విద్యా బోధన తీరు గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో జరుగుతున్న శిక్షా సప్తాహ్ కార్యక్రమాన్ని పరిశీలించారు. అనంతరం విద్యార్థుల తల్లితండ్రులతో సమావేశం నిర్వహించారు. పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్చాలని సూచించారు. కార్యక్రమం అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్, ఎంఇఒ మల్లయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేతనాల అమలుకు కృషి

ప్రజాశక్తి-ఉదయగిరి : నాలుగు నెలలుగా నిలిచిన వాచ్‌మెన్, ఆయాల వేతనాలను అందించేందుకు కషి చేస్తామని ఎంఇఒ-2 తోట శ్రీనివాసులను పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాల పరిరక్షణలో భాగంగా గత ప్రభుత్వంలో వాచ్‌మెన్, ఆయాలను నియమించిందని గత నాలుగు నెలలుగా వారికి అందాల్సిన వేతనాలు అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతు వాపోయారన్నారు. ఈ విషయం తన దృష్టికి వచ్చిందని ఇప్పటికే సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లానన్నారు. త్వరలో వారికి వేతనాలు అందేందుకు కృషి చేస్తామన్నారు.

విద్యార్థులకు తిథి భోజనం

ప్రజాశక్తి-ఉదయగిరి : పట్టణంలోని ఎంపిడిఒ కార్యాలయం సమీపంలో ఉన్న దళితవాడ పాఠశాలలో మధ్యాహ్నం భోజనం పథకంలో భాగంగా తిథి భోజనంను విశ్రాంత ఉపాధ్యాయులు సయ్యద్ కలీం తన సొంత నిధులతో విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఇఒ-2 తోట శ్రీనివాసులతో కలిసి ఆయన అరటి పండ్లను అందజేశారు. అనంతరం మధ్యాహ్నం భోజనం ఎంఇఒ రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు షేక్ షబ్బీర్, ఉపాధ్యాయులు రామకృష్ణారెడ్డి, నరసింహులు, ఐఇడి సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఇంటికి మంచినీటి సరఫరా

ప్రజాశక్తి-అనంతసాగరం

జల జీవన్ మిషన్లో భాగంగా ప్రతి ఇంటికి కొళాయిల ద్వారా నీటి సరఫరా చేయనున్నట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి తాజ్ మసూర్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని రెండో రోజున సోమశిల, పడమటి ఖమ్మంపాడు గ్రామాలలో ప్రత్యేక గ్రామసభలు నిర్వహించారు. సోమశిలలో సర్పంచ్ చలంశెట్టి పెంచలయ్య, పడమటి ఖమ్మంపాడు గ్రామంలో ఎంపిటిసి రాగమ్మ అధ్యక్షతన గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ గ్రామాలలో ప్రతి ఒక్కరూ మరుగుదొడ్లు కలిగి ఉండాలన్నారు. మరుగుదొడ్లు లేని వారు ఇంజనీర్ అసిస్టెంట్‌కు కలవాలన్నారు. ఇంకుడు గుంతల ద్వారా భూగర్భ జలాలను నివారించవచ్చని తెలిపారు. సోమశిల వడ్డెర కాలనీలో తాగునీటి సమస్య ఎక్కువగా ఉందని కాలనీ ప్రజలు ఎంపిడిఒ దృష్టికి తీసుకుని రాగా వెంటనే పరిష్కరించాలని ఇంజనీర్ అసిస్టెంట్‌ను ఆయన ఆదేశించారు. గ్రామాలలో వీధి దీపాలు లేక ఇబ్బందులు పడుతున్నామని వెంటనే ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. గ్రామంలో వీధి దీపాలు ఏర్పాటు చేయాలని ఎంపిడిఒ సర్పంచ్ చలంశెట్టి పెంచలయ్యను కోరారు. గ్రామంలో తాగునీటి సమస్య నివారణ కోసం పెద్దమోటర్లు ఏర్పాటు చేయాలని తెలుగుదేశం నాయకులు గువ్వల పెంచలయ్య ఎంపిడిఒను కోరారు. పైసమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ షేక్ మహబూబ్ బాషా, మాజీ సర్పంచ్ ఉప్పల విజయ్‌కుమార్, స్వచ్ఛభారత్ ఎంఆర్‌సి టి.శివారెడ్డి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శారద, పంచాయతీ కార్యదర్శి పుల్లయ్య, నరేంద్ర, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ సుదర్శన్, విఆర్ఒ ఉదయగిరి ప్రభాకర్, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఎంఇఒ కార్యాలయంలో తనిఖీ

ప్రజాశక్తి-సీతారామపురం : సీతారామపురంలోని ఎపి ఆదర్శ పాఠశాల, కస్తూర్బా బాలికల విద్యాలయం, ఎంఇఒ కార్యాలయాల్లో జిల్లా సమగ్ర శిక్ష అడిషనల్ కోఆర్డినేటర్ సిహెచ్ ఉషారాణి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. స్కూల్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ ఇంప్రూవ్‌మెంట్ స్టూడెంట్ కిట్‌లలో భాగంగా నోట్‌బుక్, యూనిఫారం వంటివి పిల్లలకు అందిందా.. లేదా.. అనేది నేరుగా విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలల్లో బోధన బోధనేతర సిబ్బంది విధులను పర్యవేక్షించారు. స్థానిక ఎంఆర్‌సిని సందర్శించి రిజిస్టర్లను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో జిల్లా బాలికల పిల్లల అభివృద్ధి అధికారి మమత, ఎంఇఒ మస్తాన్ వలీ, తదితరులు పాల్గొన్నారు.

రుణాలను సకాలంలో చెల్లించాలి

ప్రజాశక్తి-మర్రిపాడు : ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకులో తీసుకున్న రుణాలను రైతులు సకాలంలో చెల్లిస్తే వడ్డీ రాయితీ వరుస్తుందని మేనేజర్ జనార్ధన్ రావు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకులో రూ.100కోట్లు లావాదేవీలు ఉండగా డిపాజిట్లు రూ.15కోట్లు కన్నా తక్కువగా ఉన్నాయన్నారు. ఖాతాదారులు బ్యాంకులో రుణాలు తీసుకోవడం చెల్లించడం జరుగుతుంది కానీ



దాచుకునేందుకు ఎవరూ ముందుకు రావడం లేదన్నారు. రుణాలను సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలని అలా చేయని పక్షంలో బ్యాంకు రాయితీలు నిరూపయోగం అవుతాయన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ సత్య నారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యేక గ్రామసభలు

ప్రజాశక్తి-ఉదయగిరి : మండలంలో ఒడిఎఫ్ ప్లస్ జలజీవన్ మిషన్ 2వ రోజు మంగళవారం ప్రత్యేక గ్రామసభలలో ఎంపిడిఒ డి.ఈశ్వరమ్మ పాల్గొన్నారు. మంగళవారం మండలంలోని జిచెరుపల్లిలో సర్పంచ్ పేర్నపాటి గీత అధ్యక్షతన ప్రత్యేక గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిచెరువుపల్లి, బండగానిపల్లి, శకునాలపల్లి గ్రామసభల్లో ఎంపిడిఒ ఈశ్వరమ్మ, ఇఒపిఆర్‌డి ఎన్.మల్లికార్జున్ ఆయా గ్రామాల కార్యదర్శులు పాల్గొని వారు మాట్లాడారు. ప్రభుత్వం నిర్దేశించిన ఒడిఎఫ్ ప్లస్ జలజీవన్ మిషన్ లక్ష్యాలను సాధించే దిశగా పని చేయాలని కోరారు. మండలంలోని ఆయా సచివాలయాల పరిధిలో ఆధార్ ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నారని 24న కృష్ణంపల్లి సచివాలయం, 25న ఉదయగిరి బిట్-1 సచివాలయం, 26న గండిపాలెం గ్రామ పంచాయతీ, 27న అప్పసముద్రం సచివాలయాల పరిధిలో ఉదయం 9 గంటల నుండి సిబ్బంది అందుబాటులో ఉంటారని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం యాంటీ డయేరియా పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, ఖాదర్ కరిముల్లా, ఆంజనేయులు, ఏడుకొండలు పాల్గొన్నారు.

ఓల్డేజ్ హోమ్‌లో అన్నదానం

ప్రజాశక్తి-కావలి : ప్రవాస భారతీయులు ఫణీంద్ర సతీమణి..అఖిలేశ్వరి పుట్టిన రోజు సందర్భంగా మంగళవారం గీతామయి వృద్ధాశ్రమంలో మంగళవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. శ్రీ సాయి ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పొన్నగంటి మాధవి సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో గీతామయి ఓల్డేజ్ హోం చైర్మన్ పాండు మాట్లాడారు. ఆశ్రమంలోని వృద్ధులు ఉజ్వల భవిష్యత్తు ఇవ్వాలని ప్రార్థిస్తున్నామన్నారు.

రేబాల కాలువపై ర్యాంపు నిర్మించాలి

ప్రజాశక్తి-కోవూరు : రేబాల కాలువపై నుడా నిధులతో నిర్మించిన స్లాబును చెన్నూరు రోడ్డుకి కలుపుతూ ర్యాంప్ నిర్మించాలని సిపిఎం ఆధ్వర్యంలో మంగళవారం ప్రజలు కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కాలువపై నిర్మించిన కాంక్రీటు వాల్స్ స్లాబ్‌పై అక్కడక్కడ మాన్యువల్స్ ఏర్పాటు చేసి ఉన్నాయని, వాటిపైన కాంట్రాక్టర్ మూతలు వేయకపోవడంతో అందులో పిల్లలు పడే ప్రమాదం ఉందని సిపిఎం నాయకులు కమిషన్ దృష్టికి తీసుకుని వెళ్లారు. ఆయన వెంటనే మ్యాన్‌హోల్స్‌పై రెండు రోజులో బండలేస్తానని తెలిపారు. ర్యాంపు కూడా వేసేందుకు ప్రయత్నం చేస్తానని ఆయన తెలిపారు. రోడ్డు నుండి రామకృష్ణనగర్ వరకు నిర్మించి ఉన్నారు. ఈ రోడ్డు వల్ల సుమారు 500 కుటుంబాల వారికి అనుకూలంగా ఉంటుందని వారు తెలిపారు. అదేవిధంగా చెన్నూరు రోడ్డుపై కాలువకు రక్షణ గోడలు కూడా ఏర్పాటు చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు చల్లకొలుసు మల్లికార్జున, షేక్ జానీబాషా, పడవల సుబ్రమణ్యం, యువజన సంఘం నాయకులు కొమ్మి శ్రీనివాసులు, సిఐటియు నాయకులు మాల్యాద్రి, కామయ్య, సునీల్, తదితరులు పాల్గొన్నారు.

